# మరోసారి అవకాశం ఇవ్వండి..



అంబేద్కర్‌బస్తీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాలేరు వెంకటేశ్



గోల్నాకలో కాలేరు వెంకటేశ్‌కు హారతి ఇస్తున్న సాయి అపార్ట్‌మెంట్ మహిళలు

- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 27: అంబర్‌పేట ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నా.. ఎమ్మెల్యేగా మరోసారి నాకు అవకాశం ఇవ్వండి...నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అత్యున్నతంగా అభివృద్ధి చేసి చూపెడతానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అంబర్‌పేట ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డివిజన్‌లోని శ్రీవెంకటేశ్వరనగర్, అంబేద్కర్‌నగర్, వినాయకనగర్, హనుమాన్‌నగర్, ఖార్ఖాన గల్లి తదితర ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తు తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గత నాలుగున్నరేండ్లలో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. మరింత అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని తనను ఆదరించాలని విన్నవించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను బస్తీలలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. రూ.400లకే గ్యాస్, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి మహిళకు రూ.3వేలు సీఎం కేసీఆర్ ఇస్తారని తెలిపారు. రూ.15 లక్షల వరకు భీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ టాంకామ్ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాక చందర్, కూర నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, భూపతి నాథ్, మూర్తి, నవీన్, ఆర్కేబాబు, భూపతి లక్ష్మన్, రెడ పాక రాము, గాజుల గోపాల్, యూసుఫొద్దీన్, రాజు, ఇర్ఫానా, లావణ్య, పద్మ, సత్తయ్యగౌడ్, కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ఖార్ఖాన గల్లీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్



గోల్నాకలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్

## కాలేరు వెంకటేశ్‌కు శ్రీ సాయిరెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసుల మద్దతు



ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు
మద్దతు తెలుపుతున్న సాయిరెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌వాసులు

కాచిగూడ, అక్టోబర్ 27: తెలంగాణ సంక్షేమ పథకాలను ఆకర్శిస్తున్న ప్రజలు బీఆర్ఎస్ పార్టీని విశ్వసిస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ వ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై నల్లకుంట డివిజన్ గోల్నాకలోని శ్రీ సాయిరెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని 150 మంది వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు శుక్రవారం సంపూర్ణ మద్దతు ప్రకటించి, మహిళలు మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పరిపాలన కొనసాగుందని, అందుకు ప్రజలు బీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వివిధ రూపాల్లో చేపడుతున్న సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట పద్మశాలి యూత్ సంఘం అర్గనైజర్ బోగ స్వామి, పి.రమాదేవి, బోగలక్ష్మి, అన్నపూర్ణ, పాక రేణుక, విజయలక్ష్మి, మమత, పాక మహేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## 29న ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ,అక్టోబర్ 27: పేద, మధ్యతరగతి ప్రజల కోసం సోమాజిగూడలోని యశోద దవాఖాన సహకారంతో శ్రీనగర్ కాలనీలోని ఆదుకియాస్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో ఆధునిక పరికరాలతో ఈ నెల 29న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో గుండె, బీపీ, మధుమేహం, జనరల్, కార్డియోలజీ, గైనకాలజీ, ఆర్థోకు సంబంధించిన వైద్య సేవలను అందిస్తూ, మందులను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99670 31943, 9063888014లో సంప్రదించాలని అన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిక్కులకు ప్రభుత్వం పెద్దపీట : మంత్రి తలసాని





దసరా మిలాప్‌లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట్, అక్టోబర్ 28 : సిక్కులకు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ఈ ఎన్నికల తరువాత తిరిగి రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా 3 ఎకరాల స్థలంతో పాటు రూ.3 కోట్ల నిధులను మంజూరయ్యేలా తాను బాధ్యత తీసుకుంటానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా నగరంలోని సిఖ్ చావ్‌నీలో స్థిర నివాసాలతో వేలాది మంది సిక్కులు జీవితాలను వెళ్లదీస్తున్నా.. ఆ స్థలాలపై ఎటువంటి చట్టపరమైన హక్కులు లేకపోవడంతో నిత్యం అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్న విషయాలను తెలుసుకున్న సీఎం కేసీఆర్ కే ఒక్క నిర్ణయంతో వారి స్థలాలపై వారికే చట్టపరమైన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సారధ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సిక్కుల మనోభావాలకు పెద్దపీట వేసిందన్నారు. శుక్రవారం అమీర్‌పేట్‌లోని హోటల్ అతిథిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన దసరా మిలాప్‌కు అశేషంగా తరలివచ్చిన సిక్కుల కుటుంబ సభ్యులతో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి మంత్రి తలసాని సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలో నిలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓటు వేసి తమ రుణం తీర్చుకుంటామని సిఖ్ కుటుంబాలు ముక్త కంఠంతో ప్రకటించాయి.

**బైశాఖితో సమానంగా భగత్‌సింగ్ జయంతి..**

సిక్కులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే బైశాఖి వేడుకలతో సమానంగా షహీద్ భగత్‌సింగ్ జయంతిని కూడా జరుపుకోవాలని మంత్రి తలసాని అన్నారు. ఇందుకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సిక్కుల ఆరాధ్యుడు సహీద్ భగత్‌సింగ్ విగ్రహాన్ని అమీర్‌పేట్ సత్యం థియేటర్ చౌరస్తాలో నెలకొల్పేందుకు తాను కృషి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గురుద్వారాకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం ఇక్కడి నాలాను విస్తరించి, దానిపై శ్లాబ్‌ను నిర్మించడం వల్ల పార్కింగ్ సమస్య తీరిందన్నారు.

**బీఆర్ఎస్‌లోకి చేరికలు..** అమీర్‌పేట్‌కు చెందిన బీజేపీ నాయకులు, పెద్దసంఖ్యలో మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి తలసాని కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలంతా ఎంపీగా కిషన్‌రెడ్డిని గెలిపిస్తే... ప్రజల నమ్మకాన్ని కాపాడుకోవడంలో ఆయన విఫలమయ్యారన్నారు. ప్రజల బాగోగులు పట్టని నాయకులను ప్రజలు తిరస్కరించాలన్నారు. రిటైర్డ్ ఇంటెలిజెన్స్ అధికారి రోషన్‌సింగ్ సహా అమీర్‌పేట్ డివిజన్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు కేవల్‌సింగ్, దౌలత్‌సింగ్, మునాభాయ్‌లతో పాటు సిక్కులు మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, తెలంగాణ మైనార్టీ కమిషన్ మాజీ సభ్యుడు సర్దార్ సురిందర్‌సింగ్, గురుద్వారా ప్రబంధక్ కమిటీ అమీర్‌పేట్ అధ్యక్షుడుసర్దార్ బాగిందర్‌సింగ్, ఉపాధ్యక్షులు సులక్షణ్‌సింగ్ సిక్కు ప్రముఖులు పాల్గొన్నారు.

## రేపు ఫిలింనగర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

బంజారాహిల్స్, అక్టోబర్ 27: జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ఈ శిబిరంలో భాగంగా ధీర్ఘకాలిక జబ్బులు, వాటి పరిష్కారాలు, ఆయుర్వేద విధానంలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.